క్లుప్తంగా

రామరాజ్యం సేవలు శ్లాఘనీయం



రామరాజ్యం స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు

కొయ్యూరు: ప్రముఖ సీపీఐ నాయకుడు, మాజీ ఎంపీపీ బడుగు రామరాజ్యం ఎనిమిదో వర్ధంతిని గురువారం కించవానిపాలెంలో ఆయన స్మారక స్తూపం వద్ద ఎంపీపీ బడుగు రమేష్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామరాజ్యం నిత్యం ప్రజల కోసం పనిచేశారన్నారు. ఎన్నో సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ఆయన సేవలు శ్లాఘనీయమన్నారు. నాయకులు సత్యనారాయణ, దేముడు, కృష్ణారావు, ఉమామహేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమాలు ప్రతీ సచివాలయంలో నిర్వహించాలని సీడీపీవో విజయకుమారి మహిళా సంరక్షణ అధికారులను కోరారు. మండల కేంద్రంలోని ఆమె కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన కిశోర బాలికల వికాస కార్యక్రమానికి సంబంధించి సచివాలయాల పరిధిలో ఐదు షెడ్యూల్స్ పూర్తయ్యాయన్నారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



భక్తులతో కలిసి పూజలు చేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు తదితరులు

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీ వేలంగరువు గ్రామంలో తిరుమల–తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు నిధులతో దేవదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో నిర్మించిన లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ట గురువారం ఆలయ ధర్మకర్త వంతాల అప్పలనాయుడు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధ్వర్యంలో ఘనంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామ పెద్దలు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులకు శాలువలు కప్పి సత్కరించారు. భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. పెదలోచలిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. తోటలగరువు గ్రామంలోను మండలంలో 108 గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో జయంతి వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. వీహెచ్‌పీ ప్రతినిధులు రామకృష్ణ పరమహంస, అప్పలరాజు, వెంకటరమణ, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు

తాగునీటి బోరు పనులు ప్రారంభం



పనులు చేస్తున్న సిబ్బంది

సీలేరు: మండలంలో పలు పంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తాగునీటి బోరు తవ్వకాలను గురువారం చేపట్టారు. ఎంపీపీ బోయిన కుమారి నిధులతో దారకొండ పంచాయతీ పరిధిలో గంగవరం. పెట్రారాయి. జీడిగుంట కొత్తూరు గ్రామాల్లో నాయకులు శంకుస్థాపన చేపట్టారు. సర్పంచ్ రాజు, ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న పాల్గొన్నారు. సీలేరు పంచాయతీలో మార్కెట్ సెంటర్‌లోని బస్సు సెంటర్ వద్ద బోరు నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ దుర్జో, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరకులో అక్రమ కట్టడాలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో గుట్టచప్పుడుగా అక్రమ కట్టడాల నిర్మాణాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారికి అనుకుని గిరిజనేతరులు అక్రమంగా శాశ్వత దుకాణాలు నిర్మిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1/70 చట్టానికి విరుద్ధంగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గిరిజనేతరులు చేపడుతున్న ఈ అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌ఐ రాము మాట్లాడుతూ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

అస్తవ్యస్త పనులతో అవస్థలు

- కుళాయిలు నిర్మించారు.. బోరు నిర్మాణం మరిచారు
- చెక్కరాయిబంద గ్రామంలో తాగునీటి ఇక్కట్లు
- గెడ్డనీరే శరణ్యం
- ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని అధికారులు



ఊటగెడ్డ నుంచి కలుషిత నీటిని సేకరిస్తున్న గ్రామస్తులు



చెక్కరాయిబంద గ్రామంలో మంచినీటి ట్యాంకు



గెడ్డ నీరు తీసుకొస్తున్న మహిళలు



అలంకారప్రాయంగా కుళాయి

చింతపల్లి: మండలంలో గల చెక్కరాయిబంద గ్రామంలో తాగునీటి సమస్యలతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లంబసింగి పంచాయతీ పరిధిలో అత్యంత మారుమూలన గల ఈ గ్రామం ఏర్పడి ఐదు దశాబ్దాలు కావస్తున్నా నేటికి వారికి తాగునీరు గగనమే .ఈ గ్రామంలో 40 కుటుంబాలకు పైగా గిరిజనులు పోడు వ్యవసాయమే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటుతో పాటు తాగునీటి ట్యాంకు, బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ వాటర్ ట్యాంకు, ఇంటింటి కుళాయిలు నిర్మాణం చేపట్టి బోరు నిర్మించలేదు. మంచినీటి సౌకర్యం కోసం గ్రామంలో చేపట్టిన పనులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.గత్యంతరం లేక గ్రామానికి సుదూరంగా అటవీ ప్రాంతంలో ఉన్న ఊటగెడ్డ కలుషిత నీటినే వినియోగించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటితో రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఈ పథకం ప్రారంబించి అసంపూర్తిగా విడిచి పెట్టి ఏడాది కావస్తున్నా నిర్మాణ పనులు పూర్తిచేయక తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పథకానికి బోరు నిర్మాణం చేపట్టి తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బోరు నిర్మించాలి



గ్రామంలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకాన్ని నిర్మించి, వినియోగంలోనికి తీసుకురావాలి. కనీసం బోరు అయిన నిర్మించాలి. గ్రామంలో ఏర్పాటు చేసిన ట్యాంకు, కుళాయిలు నిరుపయోగంగా మారాయి. వెంటనే బోరు నిర్మాణం చేపట్టాలి.

– కిల్లో రాజ్‌కుమార్, చెక్కరాయిబంద

కలుషిత నీటితో ఇబ్బందులు

గ్రామంలోని తాగునీటి సమస్య ఉండడంతో సుదూరంలో ఉన్న ఊటగెడ్డను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఊటగెడ్డ కలుషిత నీటితో రోగాలు ప్రబలుతున్నాయి. వర్షం వస్తే పరిస్థితి మరింత దారణం. గ్రామానికి తాగునీటి సౌకర్యం కలుగుతుందని ఏడాదిగా ఎదురు చూస్తున్నాం. పనులు పూర్తికావు..మంచినీరు అందదు. కలుషిత నీరే గత్యంతరమైంది.

– కొర్రా బింగు, చెక్కరాయిబంద

ఎట్టకేలకు డ్రైనేజీలో చెత్త తొలగింపు



జీకే వీధిలోని డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త, వాటర్‌బాటిళ్లు (నాడు)



డ్రైనేజీలో చెత్త తొలగింపు (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. కాలువల్లో చెత్త తొలగించకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు 'చెత్త శుద్ధి ఏది' శీర్షికన ఈనెల 22న 'సాక్షి'లో ప్రచురితమైంది. ఈ కథనంపై అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని డ్రైనేజీల్లో చెత్త, వాటర్‌బాటిళ్లను తొలగించారు. డ్రైనేజీల్లో ఎవరూ చెత్త, వాటర్‌బాటిళ్లు వేయవద్దని పంచాయతీ సిబ్బంది స్థానికులకు సూచించారు

నిలిచిన బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో గత నాలుగురోజులుగా బీఎస్ఎన్ఎల్ ఫైబర్ ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలోని వర్తకులు, ఉద్యోగులు, ఇతర వినియోగదారులు, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో పనులకు ఆటంకం కలుగుతుంది. సమస్యపై పలుమార్లు అధికారులకు, సిబ్బందికి ఫోన్ చేసిన కనీసం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా ఇంటర్నెట్ సేవలు పనిచేయడం లేదని చెబుతున్నప్పటికీ సమస్యను పరిష్కారించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేక డీఎస్సీతో పోస్టులు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు బాలదేవ్, కృష్ణారావు

పాడేరు రూరల్: ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను మినహించి, ఆదివాసీ అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీపై ఉత్తర్వులు జారీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ కూటమి ప్రభుత్వంకు డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతు రాష్ట ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల నుంచి ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులకు మినహిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేయాలన్నారు, 5వ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో వంద శాతం ఆదివాసీలకే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరేతిన్నట్లు వ్యవహరిస్తుందన్నారు. అయిదో షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖ, మండల పరిషత్, గురుకులం, ఉన్నత పాఠశాల్లో 4680 ఉపాధ్యాయ పోస్టులు ప్రకటించి, ఆదివాసీలకు కేవలం 700 పోస్టులు మాత్రమే కేటయించిన్నారు. వీటిలో పాడేరు ఐటిడిఏ పరిదిలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖలో 400 ఉపాధ్యాయ పోస్టులలో ఆదివాసీలకు 24 పోస్టులు మాత్రమే కేటాయించినట్టు స్పష్టం చేశారు. 96 శాతం కోటా ఉన్న ఆదివాసీలకు ఆరు శాతం పోస్టులు కేటయించి, 6 శాతం ఉన్న గిరిజనేతరులకు 96 శాతం ఉపాధ్యాయ పోస్టులు కేటయించడం ప్రభుత్వం కుట్ర అన్నారు. ఆదివాసీలకు నూరుశాతం ఉద్యోగ రిజర్వేషన్ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం మాట నిటబెట్టుకోని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హమీ అమలు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. నాయకులు కృష్ణరావు, బుజ్జిబాబు, బాలయ్య, చిరంజీవి, రమేష్, నాగేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రపాలెంలో తిరంగా ర్యాలీ



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, ఇతర పార్టీల నేతలు

కొయ్యూరు: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని హర్షిస్తూ మండలంలోని రాజేంద్రపాలెంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైకార్ డైరెక్టర్, పార్టీ పాడేరు ఇన్‌చార్జి కూడా కృష్ణారావు మాట్లాడుతూ పెహెల్గాంలో అమాయక పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దాడులను ఖండిస్తూ భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి భారత్ సత్తా తెలిసిందన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు
- మార్మోగిన హనుమాన్ నామస్మరణ



ముంచంగిపుట్టులో స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



గాంధీనగరంలో స్వామివారికి జలాభిషేకం



సీలేరులోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వి.ఆర్.పురంలో బైక్ ర్యాలీ చేస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు/జి.మాడుగుల/సీలేరు/వి.ఆర్.పురం/గంగవరం/మోతుగూడెం/అడ్డతీగల: హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా గురువారం జరిగాయి. ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో కుంకుమ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. స్వామివారికి పూజలు, హోమాలు, అభిషేకాలు జరిపారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



పవనగిరిలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



వేటమామిడిలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



పాల్లూరులో పూజల్లో పాల్గొన్న భక్తులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



మోహన్‌రావుకు ఆర్థిక సాయమందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, నేతలు

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండలంలో గల వనభసింగి పంచాయతీ కేంద్రానికి చెందిన వంతాల మోహన్‌రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచం పట్టాడు. దీంతో పార్టీ నాయకులు వనభసింగి గ్రామానికి వెళ్లి మోహన్‌రావును పరామర్శించారు.అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అందించిన రూ.5వేలను మోహన్‌రావుకు అందజేశారు. పార్టీ అన్ని విధాలుగా కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఏ సమస్యలు వచ్చిన వెన్నుగా ఉంటామని, అధైర్య పడొద్దని మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు అన్నారు. పెదగూడ సర్పంచ్ బాబూరావు, నాయకులు జగబందు, జగన్నాథం పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయటౌన్: మారుమూల బస్కీ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత కొన్నేళ్లుగా రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హయాంలో 11 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మాణానికి రూ. 3.20 కోట్లు నిధులు మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిపివేశారు. గత మూడు రోజుల క్రితం బీటీ రోడ్డు పనులు ప్రారంభించి సుమారు ఒక కిలోమీటరు మేరకు రహదారి నిర్మించారు. మరో రెండు వారాల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఈ రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రహదారి నిర్మాణ పనులు నాణ్యతతో నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

ఎండీయూ వ్యవస్థ తొలగింపు సరికాదు



డీటీ సీతారామ్‌నకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ వాహనాలు

గూడెంకొత్తవీధి: ఇంటింటికి తిరిగి రేషన్ ఇస్తున్న ఎండీయూ వ్యవస్థను తొలగించడం సరికాదని మండల ఎండీయూ ఆపరేటర్ల సంఘం నాయకులు రీమెల పాల్, కంకిపాటి నారాయణ అన్నారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ 2027 వరకు తొలగించకూడదనే ఒప్పందం ఉన్నా దానిని కాదని రేషన్ వాహనాలను రద్దు చేయడం దారుణమన్నారు. ఆపరేటర్లను తొలగించే ముందు వారికి ఉపాధి కూడా చూపకపోవడం సరైందన్నారు. ఈ వ్యవస్థను కొనసాగించాలని వారు కోరారు. దీనిపై పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ పునరాలోచించాలన్నారు. ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సీతారామ్‌నకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఐలు మహదేవ్, సత్యనారాయణ ఉన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణం



మాట్లాడుతున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

అరకులోయటౌన్: పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలు తగదని ఏపీయూడబ్ల్యూజే అరకులోయ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్.బి.వెంకటేశ్వరరావు చెప్పారు. 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిపై ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు సోదాలు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. పత్రిక స్వేచ్ఛకు విఘాతం కలిగించే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

అవినీతి, అక్రమాలపై పత్రికల్లో వార్తలు రాస్తే పాత్రికేయులపై దాడులు చేయడం, తప్పుడు కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎల్.బి. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రవి, ఉపాధ్యక్షులుగా డి.గోవర్ధన్, ఎస్.సోమేశ్వరరావు, విలియం కేరి, లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.ఆనంద్‌రావు, కృష్ణబాబు, శ్రీను, కోశాధికారిగా బి.అనిల్ , సహాయ కోశాధికారిగా సంజీవరావు ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా తరపున సహయ ఉపాధ్యక్షుడిగా కె. రమేష్‌బాబు, ఎస్‌కె రెహమాన్, సహాయ సంయుక్త కార్యదర్శులుగా డి.ప్రశాంత్, హరిబాబు ఎన్నికయ్యారు. పాత్రికేయుల సంక్షేమానికి సంఘం తరపున కృషి చేస్తామన్నారు.

జీసీసీ అధికారులు బాధ్యతల స్వీకరణ





మేనేజర్‌గా కుమారస్వామి, సూపరింటెండెంట్‌గా రామ్మూర్తి బాధ్యతల స్వీకరణ

ముంచంగిపుట్టు: స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ మేనేజర్‌గా పాంగి కుమారస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జీసీసి మేనేజర్‌గా పనిచేసిన సింహాచలం శ్రీశైలం బదిలీ అయ్యారు. దీంతో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామిని పదవి ఉన్నతి కల్పించారు. దీంతో మేనేజర్‌గా కుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, సిబ్బంది, మండలవాసులు సహకరించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, పార్టీ నాయకుడు జగబంధు, ఉద్యోగులు,సిబ్బంది కుమారస్వామికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న జీసీసీ సూపరింటెండెంట్‌గా మోశ్యా రామ్మూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కుమారస్వామిని పదవి ఉన్నతి కల్పించి మేనేజర్‌గా నియమించడంతో అతని స్థానంలో జీసీసీ సీనియర్ సెల్స్‌మన్ రామ్మూర్తిని గోదాము సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా రామమూర్తి మాట్లాడుతూ అందరికి అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తామన్నారు. రామమూర్తికి పలువురు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మలేరియా మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి శ్యాంప్రసాద్

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాద్ అన్నారు. మండలంలోని కదుతుల, జప్పారు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి గురువారం మలేరియా నివారణ మందు పిచికారీను చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ లబ్బూరు పీహెచ్‌సీ పరిధిలో 51 గ్రామాలకు మొదటి విడత మలేరియా మందు పిచికారీ చేయాల్సి ఉండగా 45 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. జూలై నుంచి రెండవ విడత మలేరియా మందు పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బందికి స్థానికులు సహకరించి దోమల మందు పిచికారీ చేయించుకోవాలని ఆయన కోరారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్, ఆశా కార్యకర్తలు శాంతమ్మ, సుభద్ర పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగాపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో ఓ భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగాపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు పాల్గొవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబర్చాలన్నారు. అధ్యాపకులు, సిబ్బంది కోటేశ్వరరావు, గౌరీశంకర్, జానకిరామ్, అచ్యుత్, దామోదర్ పాల్గొన్నారు.

సోమాలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఘటంతో చిన్నారులు

అడ్డతీగల: సోమాలమ్మ అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు, గ్రామానికి చెందిన చిన్నారులు అమ్మవారి ఘటాన్ని నెత్తిన ధరింపజేసి ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి సంభావన సేకరించింది. గ్రామంలో సోమాలమ్మ జాతరకు వారం రోజుల ముందుగా ఈ కార్యక్రమం నిర్వహించడం స్థానికుల ఆచారం. ఈ మేరకు సేకరించిన బియ్యం , నగదును జాతర ముగిసిన అనంతరం భారీ అన్న సమారాధన చేపడుతారు.